AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN
16-12-2025 (Tuesday) MAIN EDITION

## తల్లిదండ్రులను పట్టించుకోకపోతే కఠిన చర్యలు: సజ్జనార్



**అక్షరటుడే, హైదరాబాద్:** తల్లిదండ్రులను పట్టించుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. వృద్ధాప్యంలో వారిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. తనను నిత్యం ఎంతో మంది వివిధ సమస్యలపై కలుస్తుంటారని చెప్పారు. వృద్ధాప్యంలో, అనారోగ్యంతో ఉన్న తల్లిదండ్రులను సొంత బిడ్డలే అనాథలుగా వదిలేయడం అనేకసార్లు చూశానన్నారు. తనను ఈ విషయం ఎంతో బాధ పెట్టిందని సీపీ పేర్కొన్నారు. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తల్లిదండ్రుల బాగోగులు చూడటం బిడ్డల కనీస ధర్మం అన్నారు.

## కూతురిని భవనంపై నుంచి విసిరేసిన తల్లి..

**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** నగరంలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. ఓ తల్లి తన ఏడేళ్ల కుమార్తెను బిల్డింగ్ మూడో అంతస్తు నుంచి విసిరేసింది. తీవ్రంగా గాయపడ్డ చిన్నారి మృతి చెందింది. మాల్కాజ్‌గిరి వసంతపురి కాలనీలో దారుణ ఘటన చోటు చేసుకుంది. స్థానికంగా గురుకృప అపార్ట్‌మెంట్‌లో మోనాలిసా అనే మహిళ కుటుంబంతో కలిసి జీవిస్తోంది. ఆమె తన కుమార్తె షారోని మేరిని బిల్డింగ్ పైనుంచి పడేసింది. దీంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మల్కాజ్‌గిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తల్లి మోనాలిసా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు.

## మేలోనే భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం




**అక్షరటుడే, విశాఖ:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అందంగా సిద్ధం చేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. వచ్చే నెలలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది జూన్ నాటికి ఎయిర్‌పోర్టును ప్రారంభించాలనుకున్నామని.. కానీ ఒక నెల ముందుగానే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

## కేంద్రమంత్రులతో సీఎం రేవంత్ భేటీ



**అక్షరటుడే, ఢిల్లీ:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌తో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను నిర్మలా సీతారామన్‌కు సీఎం అందజేశారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సీఎం సమావేశమయ్యారు.

## 16 మంది మావోయిస్టుల అరెస్ట్



**అక్షరటుడే, ఆసిఫాబాద్:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 16 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. సిర్పూర్ (యు) మండలం పెద్దదోబలోని ఓ పూరిగుడిసెలో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో ఆ ప్రదేశంలో కూంబింగ్ నిర్వహించి వారిని అరెస్ట్ చేశారు.

## టీటీడీ పరకామణి కేసులో హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**అక్షరటుడే, అమరావతి:** తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణి కేసులో ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రవికుమార్ అనే వ్యక్తి విదేశీ కరెన్సీని చోరీ చేసిన వ్యవహారంపై మంగళవారం విచారణ జరిగింది. రవికుమార్ అనే వ్యక్తి హుండీ నగదు లెక్కిస్తూ.. భారీగా విదేశీ కరెన్సీ చోరీ చేశాడు. ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం వచ్చాక కేసు నమోదు అయింది. ఇటీవల కేసు హైకోర్టుకు గతంలో విచారణ చేపట్టిన న్యాయస్థానం కేసు నమోదుకు ఏసీబీ, సీఐడీకి ఆదేశాలు ఇచ్చింది. తాజాగా ఈ వ్యవహారంలో విచారణ చేపట్టిన న్యాయస్థానం టీటీడీలో ఔట్ సోర్సింగ్ నియామకాలు సమంజసం కాదని చెప్పింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు బాధ్యత ఉండదని పేర్కొంది. దీంతోనే పరకామణిలో ఘటన జరిగిందని తెలిపింది.

## ఈవీఎంలతోనే నాలుగుసార్లు గెలిచా: సుప్రియా సూలే



**అక్షరటుడే, ముంబై:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) పనితీరుపై ఎన్నికల సమయాల్లో ప్రతిపక్షాలు విమర్శలు చేయడాన్ని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే తప్పుబట్టారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయానికి ఈవీఎంలను అనుమానించలేనన్నారు. తాను బారామతి నుంచి అదే మెషిన్‌పై నాలుగుసార్లు గెలిచానన్నారు. ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో సుప్రియా సూలే ఈ వ్యాఖ్యలు చేశారు.

## జీహెచ్ఎంసీ సమావేశం



# వాడీవేడిగా..

జీహెచ్ఎంసీ వార్డుల విభజనపై మంగళవారం ఉదయం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో వాడీవేడిగా చర్చ సాగింది. జీహెచ్ఎంసీ పరిధిని ఇటీవల ప్రభుత్వం విస్తరించిన విషయం తెలిసిందే. అనంతరం వార్డుల సంఖ్యను 150 నుంచి 300కు పెంచింది. ఈ క్రమంలో అనేక అభ్యంతరాలు వచ్చాయి. వీటిపై కౌన్సిల్‌లో చర్చ సాగుతోంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు వార్డుల విభజన, జీహెచ్ఎంసీ పరిధి పెంపుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

-అక్షరటుడే, హైదరాబాద్‌ప్రతినిధి

- వార్డుల విభజనపై కౌన్సిల్‌లో చర్చ
- ఎలా విభజించారని సభ్యుల ఆగ్రహం

సమావేశం ప్రారంభమయ్యాక డివిజన్ల విభజనపై ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద గౌడ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు కార్పొరేటర్లు మాట్లాడారు. వార్డుల విభజనపై వారు తమ అభ్యంతరాలను తెలిపారు. డివిజన్లను ఎలా విభజించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### శివారు ప్రాంతాలకు అన్యాయం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పరిధిని పెంచడంతో శివారు ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందన్నారు. మేడ్చల్ జిల్లాలో ఉన్న గ్రామాన్ని మున్సిపాలిటీ చేశారని, దానిని ఇప్పుడు కార్పొరేషన్‌లో విలీనం చేశారన్నారు. దాంతో అక్కడ పనులు ఎలా చేయగలుతారని ప్రశ్నించారు. దీంతో ఎవరికి ప్రయోజనమన్నారు. అధికార వికేంద్రీకరణతోనే ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. ఇంత పెద్ద నగరం ఎక్కడా లేదన్నారు. కమిటీ వేసి దీనిపై నిర్ణయం తీసుకోవాలన్నారు. జవహర్‌నగర్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తున్నారని మల్లారెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీలోని 150 డివిజన్ల చెత్త అక్కడ వేస్తున్నారని చెప్పారు. అనారోగ్యంతో అక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### అభ్యంతరాలు స్వీకరిస్తాం

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ.. వార్డుల పెంపుపై నోటిఫికేషన్ సిద్ధం చేశామన్నారు. వార్డుల పెంపుపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. రేపటితో అభ్యంతరాల స్వీకరణ గడువు ముగుస్తుందన్నారు. అభ్యంతరాలపై పరిశీలన చేపడతామని తెలిపారు. పాత రికార్డుల్లోని సర్వే నంబర్ల ఆధారంగా పునర్విభజన చేస్తున్నామని వెల్లడించారు. ఆయా వార్డులను ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ నుంచి మార్చడం లేదని స్పష్టం చేశారు.

### దానం ఆగ్రహం

వార్డుల పునర్విభజనపై ఎలాంటి సమాచారం లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనాన్ని ఆయన స్వాగతించారు. అయితే ఈ విలీనం శాస్త్రీయంగా జరిగిందా? లేదా.. అన్నారు. అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంచాలని కోరారు. శాస్త్రీయంగా వార్డుల విభజన చేపట్టాలన్నారు.

### బీజేపీ కార్పొరేటర్ల ఆందోళన

జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద బీజేపీ కార్పొరేటర్లు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. తమను సంప్రదించకుండా డివిజన్లు ఎలా పెంచుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎంకు అనుకూలంగా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి పునర్విభజన చేపట్టాయని ఆరోపించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు మూడు పార్టీలు కలిసిపోయాయన్నారు. బీజేపీ కార్పొరేటర్లు సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో వార్డుల పునర్విభజనపై అధికార పక్షానికైనా తెలిసేదన్నారు. అన్ని పార్టీలతో చర్చలు జరిగేవన్నారు.

## లీక్ వీరులపై చర్యలు తీసుకుంటాం.. కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయాలని ప్రధాని మోదీ సూచించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కొన్ని సూచనలు చేశారన్నారు. మంగళవారం ఆయన మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. సోషల్ మీడియాలో యాక్టివిటీ పెంచాలని ప్రధాని సూచించారని చెప్పారు. లోపల జరిగింది ఒకటి, బయట ప్రచారం చేసింది మరొకటి అన్నారు. ప్రధాని మోదీ సమావేశ వివరాలను లీక్ చేయడం కచ్చితంగా తప్పే అని ఆయన అన్నారు. తెలంగాణ ఎంపీలకు ప్రధాని క్లాస్ తీసుకున్నారని తప్పుడు ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లీక్ వీరులు ఎవరో తెలిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశం విషయాలు బయటకు చెప్పవద్దని ప్రధాని స్వయంగా చెప్పారన్నారు. లీకులు ఇచ్చిన నేతలు మెంటలోళ్లు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దక్షిణ భారతదేశం నుంచి ఇప్పటివరకు ఇద్దరు ఉపరాష్ట్రపతులు అయ్యారని తెలిపారు. బీజేపీలో కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు.

## పోలీసులు డ్యూటీ సరిగ్గా చేయకపోతే మేమే చేస్తాం : కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్:** పోలీసులు డ్యూటీ సక్రమంగా నిర్వర్తించకపోతే తాము పని చేయాల్సి వస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్న వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే తాము ప్రతి దాడులు చేస్తామని హెచ్చరించారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం సోమార్‌పేటలో సర్పంచ్‌గా గెలిచిన వ్యక్తి సోదరుడు.. ప్రత్యర్థి ఇంటిపై ట్రాక్టర్‌తో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కేటీఆర్ పరామర్శించారు. బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బిట్ల బాలరాజు, అతని భార్య గంజి భారతి పరామర్శించి, కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాలరాజు కుటుంబంపై దాడి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దాడి ఒకరు చేశారని, అతడి వెనకాల నలుగురు ఉన్నారని చెప్పారు. వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనలో గాయపడ్డ అందరి వైద్య ఖర్చులను పార్టీ పరంగా తాము భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సైతం బాధితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## నేను ఎవరినీ పెళ్లి చేసుకోలేదు..: మెహరీన్



టాలీవుడ్ హాట్ బ్యూటీ మెహరీన్ కౌర్ పెళ్లి గురించి సోషల్ మీడియాలో వస్తున్న ఫేక్ కథనాలు పెద్ద చర్చకు దారితీశాయి. ఆ వార్తలు వైరల్ అవ్వడంతో మెహరీన్ తీవ్ర మనస్తాపానికి గురైంది. గత రెండేళ్లుగా ఇలాంటి వ్యవహారాలపై మౌనంగా ఉన్నా, ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదంటూ స్పందించారు. "ఓ వ్యక్తిని నేను పెళ్లి చేసుకున్నట్లు వార్త రాశారు. అతడితో నాకు పరిచయం కూడా లేదు. నేను ఎవరినీ వివాహం చేసుకోలేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ప్రపంచానికి చెబుతా. నన్ను నమ్మండి" అని పేర్కొన్నారు. అంతవరకు నా పెళ్లి గురించి వదంతులు వ్యాప్తి చేయొద్దంటూ కోరారు.

- అక్షరటుడే, సినిమాడెస్క్

## ఐడీపీఎల్ భూములపై విచారణకు ఆదేశం

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరంలోని బాలానగర్‌లో గల ఐడీపీఎల్ భూములపై విచారణకు ఆదేశించింది.కూకట్‌పల్లిలోనిసర్వేనంబర్ 376లో గల భూములపై విచారణ చేపట్టాలని విజిలెన్స్ ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భూముల విలువ రూ.4 వేల కోట్లు ఉంటుందని అంచనా.


### వివాదం ఏమిటంటే?

నగరంలోని బాలానగర్, కూకట్‌పల్లి ప్రాంతాలకు చెందిన 891 ఎకరాల స్థలంలో ఐడీపీఎల్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈ డ్రగ్స్ తయారీ సంస్థ నగరంలో 1967లో ప్లాంట్‌ను ప్రారంభించింది. ఇక్కడ 47 ఔషధాలు తయారు చేసేవారు. అయితే ప్లాంట్‌లో 1996 నుంచి బల్క్‌డ్రగ్, 2003 నుంచి ఫార్ములేషన్ల తయారీ ఆపేశారు. 2003లో ప్లాంట్ మూత పడింది. హైదరాబాద్‌లో భూముల ధరలకు రెక్కలు రావడంతో కొందరు అక్రమార్కుల కన్ను ఈ భూములపై పడింది. ఇప్పటికే ఐడీపీఎల్ భూముల్లో చాలా ఎకరాలు కబ్జా అయ్యాయి. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

## టెట్ షెడ్యూల్ విడుదల

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ టెట్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యాశాఖ అధికారులు మంగళవారం విడుదల చేశారు. టెట్ ఎగ్జామ్స్ జనవరి 3 నుంచి జనవరి 20 వకు జరగనున్నాయి. రాష్ట్రంలో టెట్ పరీక్ష కోసం ఇటీవల దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. రెండు సెషన్‌లలో పరీక్షలు జరుగుతాయి. తొలి సెషన్‌లో ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. రెండో సెషన్ మధ్యాహ్నం 2-4:30 గంటల వరకు నిర్వహించనున్నారు. వివిధ జిల్లాల్లోని కేంద్రాల్లో పరీక్షలు ఉంటాయి. 1-5 తరగతులకు బోధించే వారికి పేపర్-1, ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించేందుకు పేపర్2 పరీక్ష రాయాల్సి ఉంటుంది.

## బెంగాల్‌లో 58 లక్షల ఓట్లు తొలగింపు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పశ్చిమ బెంగాల్‌లో 58 లక్షల ఓట్లను తొలగించింది. ఈ మేరకు మంగళవారం ముసాయిదా జాబితాను విడుదల చేసింది. ఎన్నికల సంఘం బెంగాల్‌లో ఇటీవల ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టింది. దీనిపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే 58 లక్షల ఓట్లను తొలగిస్తూ ఈసీ ముసాయిదా విడుదల చేయడం గమనార్హం. ఇందులో 24 లక్షల మంది మృతి చెందినట్లు ఈసీ తెలిపింది. 19 లక్షల మంది వేరోచోట స్థిర పడ్డారని, 12 లక్షల వోటర్ల ఆచూకీ లేదని చెప్పింది. 1.3 లక్షల నకిలీ ఓట్లను తొలగించినట్లు వివరించింది.